ఎండాకాలం.. జరభద్రం!

- వేసవిలో పొంచిఉన్న వ్యాధుల ముప్పు
- ఎండల్లో ఎక్కువగా తిరిగితే ప్రమాదమే
- వడదెబ్బ, డయేరియా బారినపడే అవకాశం
- జాగ్రత్తలు పాటిస్తేనే ఆరోగ్యం భద్రం



రామభద్రపురం ప్రాథమిక పాఠశాలలో వేసవిలో పాటించాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది(ఫైల్)

రామభద్రపురం: వేసవి వచ్చిందంటే చాలు మండే ఎండలు ప్రజలను ఉక్కిరిబిక్కిరి చేస్తాయి. వేడిగాలులు, తీవ్రమైన ఉక్కపోత ఊపిరాడకుండా చేస్తాయి. గతంలో ఎన్నడూ లేనంతగా ప్రస్తుతం మార్చి నెలలోనే ఎండలు మండిపోతున్నాయి. బయటకు వెళదామంటే చాలు ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు. ఉదయం 10 గంటల నుంచే సుర్రుమని కాచే ఎండకు జనం భయపడిపోతున్నారు. మరోవైపు అత్యవసరమైతే తప్ప ఎండలో బయట తిరగవద్దని వైద్యులు సూచిస్తున్నారు. ఎండాకాలంలో వ్యాధుల ముప్పు కూడా ఉంటుందని, తగిన జాగ్రత్తలు పాటించకపోతే ప్రాణాపాయమని హెచ్చరిస్తున్నారు. వేసవికాలంలో ప్రబలే కొన్ని వ్యాధులు, లక్షణాలు, జాగ్రత్తలు ఇలా..



● వడదెబ్బ..

వేసవిలో ఎండల వేడికి శరీరం ఉష్ణోగ్రతను నియంత్రించుకోలేని దుస్థితికి చేరుకుంటుంది. దీంతో ఎలక్ట్రోలైట్స్, మినరల్స్, నీటి శాతం బాగా తగ్గిపోయి బలం లేని పరిస్థితి ఏర్పడుతుంది. దీన్నే ఎండదెబ్బ(వడదెబ్బ)గా పేర్కొంటారు. శరీర ఉష్ణోగ్రత ఆకస్మికంగా పెరగడం, ఒక్కసారిగా చెమటలు పట్టడం, గుండె వేగంగా కొట్టుకోవడం, కండరాలు గట్టిపడడం, చర్మం ఎరుపు రంగులోకి మారడం, వాంతులు వచ్చినట్లుగా అనిపించడం లేదా వాంతులు చేసుకోవడం, మూర్ఛరావడం, తలనొప్పి, ఒక్కోసారి కోమాలోకి కూడా వెళ్లడం వంటివి ఈ వడదెబ్బ లక్షణాలు.

జాగ్రత్తలు..
వడదెబ్బ సోకిన వారు వైద్యులు సలహాతో మందులు వాడాలి. రోజుకు 15 నుంచి 20 గ్లాసుల నీరు తాగాలి, పండ్లు, నిమ్మరసం, మజ్జిగ, కొబ్బరినీళ్లు, చెరకురసం వంటివి ఎక్కువగా తీసుకోవాలి. తెల్లటి దుస్తులు ధరించాలి.

● గవదబిళ్లలు..

వైరస్ కారణంగా గవదబిళ్లలు వస్తాయి. లాలాజల గ్రంధులకు వాపురావడం, స్వరంలో మార్పు, తలనొప్పి, ఒళ్లునొప్పులు, అలసట, ఆకలి లేకపోవడం వంటివి ఈ వ్యాధి లక్షణాలు.

జాగ్రత్తలు..
ఈ వ్యాధి నివారణకు ముందస్తుగా ఎంఎంఆర్ వ్యాక్సిన్ వేయించుకోవడం మంచిది. గవదబిళ్లలు పూర్తిగా తగ్గేంత వరకు ఎండలోకి వెళ్లకుండా ఉండాలి.

● మీజిల్స్..

ఇది ఎక్కువగా ఎండాకాలంలో చిన్నపిల్లలకు వస్తుంది. ఫారామిక్స్ వైరస్ కారణంగా ఈ వ్యాధి సంక్రమిస్తుంది. దీనివల్ల గొంతు వెనకభాగంలో ఒక పొరలా ఏర్పడుతుంది. తీవ్రమైన జ్వరం, దగ్గు, జలుబు, గొంతునొప్పి, కళ్లు ఎర్రబడడం, నుదుటిపై ఎర్రని మచ్చలు రావడం వంటివి వ్యాధి లక్షణాలు.

జాగ్రత్తలు..
ఈ వ్యాధి సోకిన వారి నుంచి పిల్లలను దూరంగా ఉంచాలి. వైద్యుడి సలహాలతో మందులు వాడాలి. ముందస్తుగా వ్యాక్సిన్ వేయించడం మంచిది.

● టైఫాయిడ్..

ఇది కలుషిత నీరు, అపరిశుభ్రమైన ఆహార పదార్థాలు తీసుకోవడం వల్ల వస్తుంది. ఎక్కువ జ్వరం, అలసట, నిస్సత్తువ, కడుపునొప్పి, ఆకలి లేకపోవడం వంటివి ఈ జ్వరం లక్షణాలు. ఈ వ్యాధి బారినపడిన వారిలో చర్మ సమస్యలు కూడా తలెత్తుతాయి.

జాగ్రత్తలు..
శుభ్రమైన నీటిని, ఆహారాన్ని తీసుకోవాలి. బయట దొరికే చిరుతిళ్లు పూర్తిగా మానేయాలి. వైద్యుడిని సంప్రదించి, ఆయన సలహా మేరకు మందులు వాడాలి.

అప్రమత్తంగా ఉండాలి..



వేసవిలో వ్యాధుల బారినపడకుండా ముందస్తు అప్రమత్తంగా ఉండాలి. వ్యాధుల నుంచి ఉపశమనం పొందడానికి మంచినీరు, కొబ్బరినీరు, మజ్జిగ ఎక్కువగా తీసుకోవాలి. ఓఆర్ఎస్ ద్రావణం కూడా తీసుకోవాలి. పీహెచ్‌సీలు, సీహెచ్‌సీల్లో ఓఆర్ఎస్ ప్యాకెట్లు, జింక్ టాబ్లెట్లు అందుబాటులో ఉన్నాయి. వైద్యుల సలహా మేరకు వాటిని వాడితే మంచిది.

-దిలీప్‌కుమార్, వైద్యాధికారి, పీహెచ్‌సీ, రామభద్రపురం

● మలేరియా..

మలేరియా జ్వరం అనేది ఆడ ఎనాఫిలిస్ దోమ కాటువేయడం ద్వారా వ్యాపిస్తుంది. మూడు దశల్లో ఈ వ్యాధి ప్రభావం చూపుతుంది. మొదటి దశలో అధికచలి, తలనొప్పి, వాంతులు, జ్వరం ఉంటాయి, రెండో దశలో చర్మం వేడిగా, రక్తపోటు ఉంటుంది. మూడో దశలో చెమట పట్టడం, నీరసం వంటి లక్షణాలు కనిపిస్తాయి.

జాగ్రత్తలు..
వైద్యుడి సూచనల మేరకు మందులు తీసుకోవాలి. దోమలు కుట్టకుండా జాగ్రత్త వహించాలి. మితహారం తీసుకోవడం మంచిది.

● డెంగీ జ్వరం..

ఇదో రకమైన విషజ్వరం. దోమకాటు మూలంగా ఒకరి నుంచి మరొకరికి వ్యాపిస్తుంది. ఈ వ్యాధి రెండు దశల్లో ఉంటుంది. అధిక జ్వరం, తల, కళ్లు, కండరాలు, కీళ్లనొప్పులు తీవ్రంగా ఉంటాయి.

జాగ్రత్తలు..
పగటిపూట కుట్టే దోమల నుంచి జాగ్రత్తలు పాటించాలి. ఇళ్ల పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి. దోమలు పెరిగే ప్రదేశాలను నిరోధించుకోవాలి.

● అతిసార వ్యాధి..

అతిసార వ్యాధి సోకిన వారికి నీళ్ల విరేచనాలు అవుతాయి. పిల్లలు, వృద్ధులు ఈ వ్యాధి బారినపడితే చాలా ఇబ్బంది. సకాలంలో స్పందించకపోతే ప్రాణాలకే ప్రమాదం. కడుపునొప్పి, వాంతులు, విరేచనాలు, ఒక్కసారిగా బరువు తగ్గడం, శరీరంలో నీటిశాతాన్ని కోల్పోవడం వంటివి ఈ వ్యాధి లక్షణాలు.

జాగ్రత్తలు..
నిల్వ ఉన్న ఆహారం, నీరు ఎట్టి పరిస్థితుల్లోనూ తీసుకోకూడదు. ఎలక్ట్రాల్ పౌడర్ తీసుకోవడం ద్వారా నీటి శాతం, లవణాలు పెంచుకోవచ్చు. వ్యాధి పూర్తిగా తగ్గిన తర్వాతే ఆహారం, నీరు తీసుకోవాలి.

● ఆటలమ్మ..

చికెన్‌ఫాక్స్ లేదా ఆటలమ్మ వ్యాధి బారినపడడానికి వేసవి కాలం అనుకూలం. కోడిపై ఉండే మచ్చల మాదిరిగానే మన శరీరంపై కూడా నల్లని మచ్చలు వస్తాయి. ఈ వ్యాధి వైరస్ వల్ల కలుగుతుంది. ఇది అంటువ్యాధి. తీవ్రజ్వరం, అలసట, ఒంటిపై బుడగలు తేలడం, తలనొప్పి, దురద, ఆకలి తగ్గడం వంటివి ఈ వ్యాధి లక్షణాలు.

జాగ్రత్తలు..
వ్యాధి తగ్గడానికి కనీసం 10 నుంచి 15 రోజుల సమయం పడుతుంది. వ్యాధిగ్రస్తులు పూర్తిగా విశ్రాంతి తీసుకోవాలి. మరొకరికి వ్యాధి సోకకుండా వ్యాధి బారినపడిన వ్యక్తిని కాస్త దూరంగా ఉంచాలి.

క్లుప్తంగా

బొబ్బిలి ఏఎంసీ చైర్మన్‌గా నర్సుపల్లి



తెర్లాం: బొబ్బిలి ఏఎంసీ చైర్మన్‌గా తెర్లాంకు చెందిన నర్సుపల్లి వెంకటనాయుడు నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం శుక్రవారం ఓ ప్రకటన విడుదల చేసింది. తెర్లాం మండలానికి బొబ్బిలి ఏఎంసీ పదవి రావడం ఇది మూడోసారి కాగా తనకు పదవి రావడానికి కృషి చేసిన ఎమ్మెల్యే బేబీనాయన, మాజీ మంత్రి సుజయ్‌కృష్ణ రంగారావులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

విద్యార్థినులకు ఆత్మరక్షణలో శిక్షణ



విద్యార్థినులకు శిక్షణ ఇస్తున్న దృశ్యం

బొబ్బిలి: స్థానిక గిరిజన సంక్షేమ బాలికోన్నత పాఠశాలలో విద్యార్థినులకు ఆత్మరక్షణలో శుక్రవారం శిక్షణ ఇచ్చారు. డీఎస్పీ జి.భవ్యరెడ్డి మాట్లాడుతూ ఆత్మరక్షణ కోసం సెల్ఫ్ డిఫెన్స్ ట్రిక్స్ నేర్చుకోవాలని తెలిపారు. ప్రతిఒక్కరూ స్వీయరక్షణ శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సీఐ కె.సతీష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సన్మానం

బొబ్బిలిరూరల్: మండలంలోని జగన్నాథపురం సచివాలయంలో ప్రకృతి వ్యవసాయం చేస్తున్న రైతులు కనిమెరక సత్యనారాయణ, సునీతలను శుక్రవారం సన్మానించారు. ప్రకృతి సాగు చేయడం ద్వారా ఆరోగ్యవంతమైన పంటలు ప్రజలకు అందుతాయని, తద్వారా ఆరోగ్యకరమైన సమాజం ఏర్పడుతుందని తహసీల్దారు ఎం.శ్రీను తెలిపారు. ఎంతోమంది రైతులకు ఆదర్శంగా నిలుస్తున్నారని, ఇదే ప్రకృతి సాగు కొనసాగించాలని ఎంపీడీవో పి.రవికుమార్ వారిని అభినందించి, ప్రోత్సహించారు. కార్యక్రమంలో సర్పంచ్ బొద్దల పద్మ, సత్యన్నారాయణ తదితరులు పాల్గొన్నారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి



మగ్గూరు గ్రామస్తులతో మాట్లాడుతున్న ఎస్‌ఐ షేక్‌శంకర్

వంగర: ప్రతిఒక్కరూ గంజాయి, ఖైనీ, గుట్కా, మద్యం, సిగరెట్ వంటి మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని ఎస్‌ఐ షేక్‌శంకర్ సూచించారు. పల్లెనిద్ర కార్యక్రమంలో భాగంగా మండలంలోని మగ్గూరులో శుక్రవారం రాత్రి బస చేసిన ఆయన అక్కడి యువతకు మంచి నడవడికపై మార్గనిర్దేశం చేశారు. ప్రస్తుతం ఫ్యాషన్ మాయలో పడి విద్యార్థులు, యువత చెడు అలవాట్లు బారినపడి జీవితాలు నాశనం చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే క్రికెట్ బెట్టింగ్‌లకు పాల్పడవద్దని, సైబర్‌నేరాల బారినపడకుండా జాగ్రత్త వహించాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ పోలిరెడ్డి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఈకేవైసీ నమోదు చేసుకోండి

వంగర: రేషన్ కార్డుదారులంతా ఈకేవైసీ నమోదు చేసుకోవాలని సివిల్ సప్లయి డీటీ రామారావు సూచించారు. ఇదే విషయమై ఆయన మండల కేంద్రంలోని విలేకరులతో శుక్రవారం మాట్లాడారు. మండలంలో మొత్తం 34,722 రేషన్‌కార్డులు ఉన్నాయని, వీరిలో 3073 మంది ఈకేవైసీ ఇంతవరకు చేసుకోలేదని పేర్కొన్నారు. ఈకేవైసీ చేసుకునేందుకు ఈ నెల 31వ తేదీ ఆఖరు అని, రేషన్ డిపోల వద్ద గానీ సచివాలయాల్లో గానీ ఈకేవైసీ చేయించుకోవాలని తెలిపారు.

చలివేంద్రాలు ఏర్పాటు

తెర్లాం: మండల కేంద్రంలోని మూడు పెట్రోల్ బంకుల వద్ద చలివేంద్రాలు శుక్రవారం ఏర్పాటు చేశారు. తహసీల్దారు జి.హేమంత్‌కుమార్ ఆదేశాల మేరకు ఆర్‌ఐ మరిపి కృష్ణమూర్తి పర్యవేక్షణలో తెర్లాం జంక్షన్‌లోని భారత్, హెచ్‌పీ పెట్రోల్ బంకుల వద్ద, పెరుమాళిలో డీసీసీబీ ఆధ్వర్యంలో నడుస్తున్న పెట్రోల్ బంకు వద్ద చలివేంద్రాలు ఏర్పాటు చేశారు. వేసవి ఎండలను దృష్టిలో ఉంచుకుని, వాహనదారుల దాహార్తి తీర్చేందుకు వీటిని ఏర్పాటు చేసినట్లు తహసీల్దారు తెలిపారు.

రూ.2.50 లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణం



సీసీ రోడ్డు నిర్మిస్తున్న దృశ్యం

రేగిడి: మండలంలోని అప్పాపురం గ్రామంలోని దిగువ వీధిలో సీసీ రోడ్డు నిర్మాణ పనులు శుక్రవారం చేపట్టారు. రూ.2.50 లక్షలతో గ్రామ పంచాయతీ నిధులతో ఈ పనులు ప్రారంభించినట్లు ఇంజినీరింగ్ శాఖ టెక్నికల్ కార్యదర్శి ఎం.వెంకటేష్ తెలిపారు.

శాంతిభద్రతల పరిరక్షణపై ప్రత్యేక దృష్టి



మహిళా పోలీసులకు సూచనలిస్తున్న డీఎస్పీ రాఘవులు

రాజాం సిటీ: గ్రామీణ ప్రాంతాల్లో శాంతిభద్రతల పరిరక్షణపై ప్రత్యేక దృష్టి సారించాలని చీపురుపల్లి డీఎస్పీ ఎస్.రాఘవులు సూచించారు. స్థానిక పట్టణంలోని ఓ కల్యాణ మండపంలో రాజాం టౌన్, రూరల్ పరిధిలోని మహిళా పోలీసులతో శుక్రవారం సమావేశమైన ఆయన.. గ్రామ స్థాయిలోని అన్ని సమస్యలను తెలుసుకుంటే తద్వారా నేరాలు అరికట్టేందుకు వీలుంటుందన్నారు. సైబర్ నేరాలు, రోడ్డు భద్రతా నియమాలు, వివిధ చట్టాలు, మత్తు పదార్థాల వల్ల కలిగే దుష్ప్రభావాలపై ఎప్పటికప్పుడు అవగాహన కార్యక్రమాలు చేపట్టాలన్నారు. ప్రజలు కూడా సోదరభావంతో మెలగి, ఆదర్శవంతమైన సమాజ రూపకల్పనలో భాగస్వాములు కావాలని కోరారు. క్రికెట్ బెట్టింగ్‌లు జరగకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో రాజాం టౌన్, రూరల్ సీఐలు కె.అశోక్‌కుమార్, హెచ్.ఉపేంద్రరావు, ఎస్‌ఐలు రవికిరణ్, సూర్యనారాయణ, పి.నీలావతి, ఆర్.గోపాలరావు, షేక్‌శంకర్ తదితరులు పాల్గొన్నారు.

నేడు బీసీ కార్పొరేషన్ రుణాలకు ఇంటర్వ్యూలు



రామభద్రపురం: జెడ్పీటీసీ సరస్వతి ఆధ్వర్యంలో దరఖాస్తుదారులను ఇంటర్వ్యూ చేస్తున్న ఏవో సన్యాసిరావు

వంగర/బాడంగి: మండల పరిషత్ కార్యాలయాల్లో బీసీ కార్పొరేషన్ రుణాలకు సంబంధించి ఇంటర్వ్యూలు శనివారం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవోలు లోపింటి త్రినాథ్, శంబంగి రామకృష్ణలు ఓ ప్రకటనలో శుక్రవారం తెలిపారు. బాడంగి మండలంలోని పలు పంచాయతీల నుంచి 307 మంది రుణాల కోసం దరఖాస్తు చేసుకున్నారని, ఉదయం 10 గంటలకు ఇంటర్వ్యూకు హాజరుకావాలని ఎంపీడీవో కోరారు. ఇదిలా ఉంటే బాడంగి మండలానికి 71 యూనిట్లు కేటాయించగా, 401 మంది దరఖాస్తు చేసుకున్నారని ఎంపీడీవో త్రినాథ్ తెలిపారు. దరఖాస్తుదారులంతా అర్హత తెలిపే అన్ని ధ్రువీకరణపత్రాలతో ఇంటర్వ్యూకు రావాలన్నారు.

సజావుగా ఇంటర్వ్యూలు..
రామభద్రపురం/బొబ్బిలి: మండల కేంద్రాల్లో బీసీ కార్పొరేషన్ రుణాల కోసం దరఖాస్తుదారులకు శుక్రవారం నిర్వహించిన ఇంటర్వ్యూలు సజావుగా కొనసాగాయి. రామభద్రపురం మండలంలోని వివిధ గ్రామాల నుంచి బీసీ కార్పొరేషన్‌కు 424 మంది, ఈబీసీ కార్పొరేషన్‌కు 01, బ్రాహ్మణ కార్పొరేషన్‌కు 02, వైశ్య కార్పొరేషన్‌కు 10, కాపు కార్పొరేషన్‌కు 08, కుమ్మరి కార్పొరేషన్‌కు 08, జనరిక్ మెడికల్ షాపునకు 02 దరఖాస్తులు వచ్చాయి. బొబ్బిలి పట్టణంలోని బీసీలకు 78, ఈబీసీలకు ఐదు యూనిట్లు మంజూరు చేశారు.

పాఠశాలను తరలించొద్దు



విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశమైన యూటీఎఫ్ నాయకులు

బొబ్బిలిరూరల్:

మండలంలోని కారాడ గ్రామంలోని ప్రాథమికోన్నత పాఠశాలను అలజంగి ఉన్నత పాఠశాలకు తరలించవద్దని విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు విజ్ఞప్తి చేస్తున్నారు. ఇదే విషయమై కారాడ గ్రామంలో యూటీఎఫ్ ఆధ్వర్యంలో విద్యార్థుల తల్లిదండ్రులతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. విద్యార్థులు తక్కువగా ఉన్నారన్న కారణంతో కారాడ పాఠశాలలోని 6, 7, 8 తరగతుల విద్యార్థులను అలజంగి పాఠశాలకు తరలించడం సరికాదన్నారు. మొత్తం 56 మంది విద్యార్థులు ఉన్నారని, అవసరమైతే పాఠశాలను అప్‌గ్రేడ్ చేసి, తరగతులు కొనసాగించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం ఇష్టానుసారంగా నిర్ణయాలు తీసుకుంటే తాము పోరాటానికి సిద్ధమన్నారు. కార్యక్రమంలో యూటీఎఫ్ రాష్ట్ర నాయకురాలు విజయగౌరి తదితరులు పాల్గొన్నారు.

ఫారంపాండ్‌లతో భూగర్భజలాల సంరక్షణ



రేగిడి: ఫారంపాండ్‌ల తవ్వకాల పనులను పరిశీలిస్తున్న ఏపీవో హరనాథరావు

రేగిడి: మండలంలోని ఆమదాలవలస గ్రామ జీడిమామిడి తోటల్లో జరుగుతున్న ఫారంపాండ్ పనులను ఏపీవో హరనాథరావు శుక్రవారం పరిశీలించారు. ఉపాధి పనుల్లో భాగంగా జరుగుతున్న ఈ ఫారంపాండ్‌లతో భూగర్భజలాలను రక్షించవచ్చని ఆయన తెలిపారు. అలాగే నిర్దేశిత కొలతల ప్రకారం పనులు చేయడానికి ఆస్కారం ఉండి, గిట్టుబాటు అయ్యే వేతనం కూడా లభిస్తుందన్నారు.

బొబ్బిలిరూరల్: మండలంలోని పారాది గ్రామంలో జరుగుతున్న ఉపాధి హామీ పథకం పనులను బీజేపీ మండల నాయకులు తాడ్డి ఈశ్వరరావు, రుంకాన రఘులు శుక్రవారం పరిశీలించారు. అనంతరం అక్కడి వేతనదారుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. రోజూ కష్టపడి పనిచేస్తున్నా వచ్చే కూలి గిట్టుబాటు కావడం లేదని, రోజుకు రూ.60 మాత్రమే వస్తోందని వేతనదారులు వారికి తెలిపారు. ఎప్పటికప్పుడు కూలి డబ్బుల చెల్లింపులు కూడా జరగడం లేదన్నారు.

అభ్యసన సామర్థ్యాల పరిశీలన



వంగర: విద్యార్థులను ప్రశ్నలడుగుతున్న ఎంఈవో జగదీశ్వరి

వంగర: మండలంలోని జగన్నాథవలస గ్రామ ప్రాథమిక పాఠశాలను ఎంఈవో2 ఖండాపు జగదీశ్వరి శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె పాఠశాల రికార్డులు, విద్యార్థులు, ఉపాధ్యాయుల హాజరు పరిశీలించి, పలు సూచనలు చేశారు. అనంతరం తరగతుల వారీగా విద్యార్థుల వద్దకు వెళ్లి, వివిధ ప్రశ్నలడిగి వారి అభ్యసన సామర్థ్యాలు పరిశీలించారు. విద్యార్థులకు నాణ్యమైన విద్య, భోజనం అందివ్వాలన్నారు.

రేగిడి: విద్యార్థుల హాజరు శాతంపై ఉపాధ్యాయులు దృష్టి సారించాలని, రానున్న విద్యా సంవత్సరంలో ఈ ఏడాది కన్నా ఎక్కువ హాజరు శాతం ఉండేలా చూడాలని ఎంఈవో ఎంవీ ప్రసాదరావు ఉపాధ్యాయులకు సూచించారు. మండలంలోని నాయిరాలవలస గ్రామంలో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను ఆయన శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. మధ్యాహ్న భోజన పథకం, వాటర్ బెల్ అమలుపై ఆరాతీశారు.

15 కిలోల నిషేధిత పాలిథిన్ సంచుల సీజ్



నిషేధిత పాలిథిన్ సంచులను స్వాధీనం చేసుకున్న శానిటరీ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్

రాజాం: స్థానిక బొబ్బిలి, చీపురుపల్లి రోడ్లలోని పలు దుకాణాలు, తోపుడుబండ్లు, మటన్, చికెన్ షాపుల్లో మున్సిపల్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ సీహెచ్ ప్రసాద్ శుక్రవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. మొత్తం 15 కిలోల నిషేధిత పాలిథిన్ సంచులను స్వాధీనం చేసుకుని, సీజ్ చేశారు. నిషేధిత ప్లాస్టిక్, పాలిథిన్ వినియోగించడం వల్ల కేన్సర్ బారినపడే అవకాశం ఉందని, వ్యాపారులు, ప్రజలు గమనించి పాలిథిన్ నిషేధానికి సహకరించాలని కోరారు.

వక్ఫ్‌బోర్డు సవరణ బిల్లుకు వ్యతిరేకంగా నిరసన



వక్ఫ్‌బోర్డు సవరణ బిల్లును వ్యతిరేకిస్తూ ముస్లింలు నల్లరిబ్బన్లు ధరించి, నమాజ్‌కు హాజరయ్యారు. పవిత్ర రంజాన్ మాసం చివరి రోజు అయిన శుక్రవారం బొబ్బిలి జామియా మసీదులో ఇలా నల్లరిబ్బన్లతో ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు. ఆలిండియా ముస్లిం పర్సనల్ లా బోర్డు ఇచ్చిన పిలుపు మేరకు ఈ నిరసన కార్యక్రమం చేపట్టామని, కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన వక్ఫ్‌బోర్డు సవరణ చట్టాలను తాము వ్యతిరేకిస్తున్నట్లు స్పష్టం చేశారు. పటిష్టంగా ఉన్న చట్టాన్ని నిర్వీర్యం చేసేందుకు మోదీ సర్కారు తయారవ్వడం తగదన్నారు. కొత్త బిల్లుతో మసీదుల పరిధిలోని ఆస్తులు అన్యాక్రాంతమయ్యేందుకు అవకాశం ఉందని ముస్లిం మతపెద్దలు ఆందోళన వ్యక్తం చేశారు. - బొబ్బిలి

ప్రమాదకరంగా విద్యుత్‌స్తంభం



రామభద్రపురం మండలం, జీలికవలస గిరిజన గ్రామంలోని ఓ వీధి మధ్యలోని విద్యుత్‌స్తంభం ప్రమాదకరంగా కనిపిస్తోంది. స్తంభం ఇనుపది కావడంతో దాని కింది భాగం బాగా తుప్పపట్టడంతో బలం కోల్పోయి ఓ పక్కకు ఒరిగిపోయింది. ప్రస్తుతం దానిని కర్రలతో నిలబెట్టే ప్రయత్నం చేశారు. అది ఏ క్షణాన కూలుతుందో.. ఏం ప్రమాదం జరుగుతుందోనని గ్రామస్తులు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి, తక్షణమే కొత్త స్తంభం ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

-రామభద్రపురం

రక్షిత మంచినీరు అందించండి



బొబ్బిలి మండలం, చిత్రకోటబొడ్డవలస ఎస్సీ కాలనీవాసులు తాగునీటికి కటకటలాడుతున్నారు. వారం రోజులుగా తమకు తాగునీరు అందడం లేదని, అయినా పాలకులు గానీ అధికారులు గానీ పట్టించుకోవడం లేదని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఊరిలోని బోరు నుంచి తీసుకువచ్చిన నీటిని తాగునీటిగా వినియోగిస్తున్నామని వాపోతున్నారు. ఇదే సమస్యను ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ శ్రావణ్‌కుమార్ వద్ద ప్రస్తావించగా, వాటర్ ట్యాంకులోని నీటిని తీసుకువెళ్లే పైపులు మరమ్మతులకు గురవ్వడంతో ఎత్తైన ప్రాంతంలోని వారికి అందివ్వడం కుదరడం లేదన్నారు. త్వరలోనే కొత్త పైపులు తీసుకువచ్చి, తాగునీరు అందిస్తామన్నారు.

- బొబ్బిలిరూరల్

కొత్త విషయాలు నేర్చుకోవాలనే కుతూహలం ఉండాలి



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న మంత్రి కొండపల్లి శ్రీనివాస్

రాజాం సిటీ: కొత్త విషయాలు నేర్చుకోవాలనే కుతూహలం విద్యార్థులకు ఉండాలని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం స్థానిక జీఎంఆర్ ఐటీ వార్షికోత్సవానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన కాసేపు విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. విద్యార్థులు చదువుతో పాటు ఆటపాటలు, సాంస్కృతిక కార్యక్రమాల్లోనూ రాణించాలని ఆకాంక్షించారు. తాను కూడా ఇదే కళాశాలలో చదివానని, అప్పట్లో తాను ఆటలతో పాటు సాంస్కృతిక కార్యక్రమాల్లోనూ ముందుండేవాడినన్నారు. జీవితంలో ఉన్నత స్థానంలో స్థిరపడాలంటే పట్టుదలతో పాటు నైపుణ్యాలు పెంపొందించుకోవాలన్నారు. మరో అతిథి పద్మజ మాట్లాడుతూ కోర్సుతో సంబంధం లేకుండా అనేకానేక కొత్త విషయాలు నేర్చుకుని ప్రత్యేకత చాటుకోవాలన్నారు. మనం ఎంచుకున్న రంగాల్లో మనతో సమానమైన నైపుణ్యాలు కలిగిన వారితో స్నేహం చేయడం అవసరమన్నారు. అనంతరం పలువురు ప్రతిభావంతులైన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. అంతకుముందు నిర్వహించిన స్పోర్ట్స్ డేలో కొండవెలగాడకు చెందిన వెయిట్ లిఫ్టింగ్ కోచ్ చల్లా రాము తన అనుభవాలను విద్యార్థులకు తెలిపారు. కార్యక్రమంలో భాగంగా చేపట్టిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. జీఎంఆర్ ఐటీ ఎడ్యుకేషనల్ డైరెక్టర్ డాక్టర్ జె.గిరీష్, ప్రిన్సిపాల్ డాక్టర్ సీఎల్‌వీఆర్ఎస్‌వీ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. రాజాం: స్థానిక శ్రీవత్స ఇంగ్లిష్ మీడియం స్కూల్ వార్షికోత్సవం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. విద్యా సంబంధిత కార్యక్రమాలు, సాంస్కృతిక ప్రదర్శనల్లో విశేష ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో చైర్మన్ తులసిరెడ్డి పాల్గొన్నారు.